# నీ టి పం ప కం

★

శ్రీ కె. వి. కృష్ణమూర్తి

'ఒసే, లచ్చీ, రెండుగంటలు పొద్దోయింది. తిరిగి తిరిగి నాలు కార్చుక పోతుండాది. ఇసిన్ని నీళ్లియ్యవే, తాగనానికి' అని అడిగాను

'ఏం, నాన్నా, పొలానికి నీరొస్తదా? ఏటయింది. ఎవ్వారం?' అని ఆదుర్దా పడతా అడిగినాది లచ్చి, నీళ్లిస్తూ.

'ఇంకేటయ్యేది. ఈసారికూడా పంట నష్టమే. ఎంకడేడీ?'

'బాబయ్యా, పొల మెలాగుండాది' అని అడిగాడు ఎంకడు.

'నారు పోయడాని కెప్పుడెళ్లేది బాబయ్యా?' అని అడిగినాది లచ్చి.

'నాకేటి పోసేది! గడ్డపారేస్తే ఖంగుమంటా ఉంది బూఁవి' అన్నా

నిజంకూడా అంతే. గడ్డపారేస్తే ఖంగుమంటా ఉండాది, నీటిచుక్క లేదామె—ఎండిపోయింది. ఈపాటికి బట్టిలో గనక నీరొస్తే బూఁవంతా చిఁష చిఁవ మంటా ఉండాలిసింది. బట్టిలోనే నీరు కొంతకొంత వస్తుం డాదామె. చిట్టచివరి నా పొలానికి ఎక్కడందుతాది? పోయిన సంవత్సరం పలాసా, మందసాల్లో కరువొచ్చి మనుషులు పురుగుల్లాసచ్చి పొయ్యారన్నారు. మాగతికూడా అంతే కావొచ్చును ఈసారి. దగ్గరున్న కుమరాడ చెర్వు గర్బం మెరకపడి చెరువులోకే నీరు రావడం లేదు. ఆవచ్చిన నీరుకూడా తూముల్లోంచి పొలాల్లోకి పారడం లేదు. తూమును మరమ్మత్తు చేయమని ఓవర్సీరుకి దరఖాస్తు పెట్టుకుంటే, 'అదిగో, ఇదిగో' అంటూ మూడేళ్లు గడిపాడు.

ఇంకేటిరా గతి అని అనుకుంటూంటే, ఇద్దరు ముగ్గురిని ఎంట బెట్టుకుని పుల్లయ్య, కఱ్ఱలతోటి బట్టియేపు పరుగెత్తుండాడు.

'యాడికోయి, ఈ పరుగు, కఱ్ఱలతోటి?' అని అడిగా.

'ఇంకా యాడికేటి కుమరాడ బట్టి కాడికి—ఎంకటాపురం రైతులు బట్టికడ్డంగా పూను పళారంట. ఆ

పూను పూనులాగే ఉంటే – మన నోట్లో మట్టే. ఇయ్యాల బుఱ్ఱలు పగలాలిసిందే'

'ఆఁ, ఏటి? వాళ్లెవరోయి పూనెయ్యడానికి. మనంఎల్లి ఓవరు సీరుతో సెబుదాంరా'

'ఏడ్సినట్టే ఉంది. కంచే చేను మేస్తే - ఇంకది కాచే కాపేటి?

ఏటి? ఓవరుసీరే ఏయించినా ఊంటవా?'

బట్టి = కాలువ
పూను=కాలువ నీటికి పెట్టిన అడ్డం.

'ఇంకాఅనేదేంది మొన్నరాత్రి ఎంకటాపురంలో పెద్దరైతు రామస్వామి ఇంట్లో ఓవర్ సీరుకి యిందు సేశారు. యినలా - యిదయింతరువాత అప్పలమ్మ పాటకచ్చేరి చేసింది కూడాను. మరి ఊరికేనను కుండవా?

'ఏటి? యీడి దుంపతెగా? ఆ బాబే యేయించిందూ పూను? ఆఎంకటాపురం రైతులు పనేటో సూశెయ్యాలి. పదరా ఎంకయ్యా, నారయ్యా పదండి. ఏం పుల్లయ్యా, ముసిలోళ్లం మనంమటుకే ఎడితే ఎలాగు - ఏడు చోళ్లని తీసికెళ్లొద్దూ?' అన్నా. అందరం కఱ్ఱలు తీసుకు బయలుదేరాం.

పెద్ద బట్టిలోనుంచి, మా రెండు గ్రామాలకు, అంటే కుమరాడ, ఎంకటాపురం గ్రామాలకు కలిపి ఒకపాయ చిన్నబట్టి వస్తుంది. పేరేమో, కుమరాడబట్టి అనే కాని, కుమరాడ ఎంకటాపురం రెంటికి నీరిస్తుందీబట్టి. ఇక్కే రెండు పాయలుగా చీలి కుడిపాయ ఎంకటాపురం పొలాలకు, ఎడంపాయ కుమరాడకు నీరెడుతుంది. ఈ పాయలయ్యే జాగాలో రెండు గ్రామాలకు సరిగా పంపకంచేసే ఎత్తు ఏదయినా కట్టితే ఏ తగూ లేకపాయె. ఎత్తు కట్టండోయి అని-ఎన్ని అర్జీలు పెట్టుకొన్నా. ఓవర్ సీరు బాబు యినడు. ఎందుకో అర్థంకాకుండా ఉండాది. నాకు అర్థం కాకపోవడమేట్లే, అయిందనే సెప్పాలి, కాబట్టి, ఏపక్క రైతులు పల్లంచేస్తే ఆపక్క ఎక్కువ నీరు పారడం రెండో ఊరికి నీరు లేకపోవడం నీటికోసం కొట్టుకోవడం, ఇది మామూలయిపోయినాది మాకు.

బట్టి రెండుగాచీలేది, కుమరాడ రోడ్డు పక్కనే. ఆడి కొచ్చేకాడికి యింకేటి సెప్పేది. రెండువైపుల,

కత్తులు, కటార్లు తీసుకొని రెండు గ్రామాల రైతులు నిల్చుండారు. మధ్యలో ఓవరుసీరు గుమాస్తా ఉన్నాడు. కుమరాడకు నీరురాకుండా బట్టిలో పూనేసి, అంత నీరు ఎంకటాపురానికి తిప్పుతున్నారు ఆవూరి రైతులు. 'నరసయ్యా పూను తీసేస్తావా మరియాదగా, లేక...?' అన్నాడు మా పుల్లయ్య:

'లేక... లేకపోతే, పీక తీసేస్తావా ఏటి? ఏటినీమాటలు- సరిగ్గా రానియ్యి' అన్నాడు నరసయ్య:

'పీక తీసేదేటి? నువ్వు తీసెయ్య గలవా ఏటి? పూను తీసెయ్యి మరియాదగా, అన్నాడు పుల్లయ్య. 'మాపొలాలెండిపోతుండయి పొలాలెండిపోతే మాపానాలెండి పోయాయన్నమాటే, మేం తీసెయ్యం" అన్నారు ఎంకటాపురం రైతులు.

'మా పానాలు మటుకు కెండి పోడంలా ?... మీలాంటి పొలాలే మాయీని' అన్నారు కుమరాడ రైతులు:

'అవునోయి - పుల్లయ్యా - పాపం, నరసయ్య పొలం పూరిగా ఎండిపోతుండాది. పాపం, పూనేసుకోన్నీ' అన్నాడు. ఓవర్ సీరు గుమాస్తా.

'పెద్ద తీర్పే తీర్చావు బాబయ్యా అసలు బట్టిలో నీటికెందుకు కరువొచ్చిందీ? మొగ పూరిగా ఎందుకు తెరవాలే? పెద్దబట్టిలో నీరు పూరిగా పారుతుంటే, మా బట్టికి నీరు కరువేటి? అసలు నీరుకట్టేసి, పూనేసుకోమని సలహా ఏటండీ?' అన్నాడు మా ఎంకడు.

'ఏయ్ జాగ్రత సరిగ్గామాటలు రానియ్యి. లేకపోతే ఏంజేస్తానో చూడు' అని గుడ్లురిమి చూశాడు గుమాస్తా.

ఇంతలో మా పుల్లయ్య తన కఱ్ఱతో పూనును కదిపాడు.

నరసయ్య కొట్టడానికి కఱ్ఱ పైకెత్తాడు. అందరికఱ్ఱలు పైకెళ్ళినయి. గుమాస్తాకు భయమేసిందికాబోలు చప్పున పరుగెత్తుకు ఎళ్లిపోయాడు. ఆయన ఎల్లిపోగానే ఓవర్ సీరుబాబు ఎల్లిపొయ్యొచ్చిండు రంగమ్మానికి.

'ఏమిటోయి, సింహాద్రీ, అప్పన్నా, పుల్లయ్యా, నరసయ్యా, మీలాంటి పెద్దలుండికూడా, ఇలా కొట్టుకోడానికి పూనుకుంటే, ఇంకెలాగోయ్. ఏదో కరువురోజుల్లో నీరు ఎలాగోఅలాగు పంచుకోవాలి

కాని...' అన్నాడు.

'అవును, బాబూ, మా గుంటలబ్రతుకులన్ని దీనిమీదే ఉండయి, బాబయ్యా, అందుకని ఇంతగొడవ' అన్నా నేను.

'అయితే, ఏమిటి, ఎంకటాపురం రైతులకు నీరియ్యదలచుకో లేదా మీరు?' అన్నాడు.

'మే మెవళ్ళం నీరిచ్చేందుకు. నీరిచ్చే పెబువులు మీరు. మీ రాళ్ళకే యియ్య దలచుకొన్నారు. మరి మా కియ్యరా' అన్నాడు పుల్లయ్య.

'మీరూ తీసుకోందురు గాని లేవోయ్. ముందు వాళ్లనికానీ.'

'అదేటిబాబూ, అవసరం గడిచి పోతే మాకు మటు కెందుకు?'

ఎన్నెనో సెప్పి సూశాడు మాకు ఓవరుసీరుబాబు వాళ్లకు నీరిద్దామని. ఊఁ హుఁ. మా ఓళ్లివలా. ఆయనకు కోప మొచ్చింది.

'ఏమిటోయ్. యిలా దెబ్బలాడుతున్నారు. ఈ నీరు మీ తాతల సొత్తనుకున్నారా?'

'లేదుబాబూ, మీ తాతసొత్తేనని మాకు తెల్సు' నన్నాడు ఎంకడు.

'అఁ. గుంటవెధవా! ఎంత మాటన్నావు, మా తాత సొత్తూకాదు మీ తాత సొత్తూకాదు. సర్కారుది ఈ నీరు. నా యిష్టం వచ్చినట్టు పంచుతాను.'

'సర్కారు దేలాగయినాది బాబూ. దేవుడిచ్చిన నీరు. 'నాగావళి' లో నీరు మాదా సర్కారు పుట్టించిందా ఏటి? మాదగ్గర బూమిశిస్తు కాసక నీటిశిస్తుకూడా తీసుకుంటున్నారే సర్కారు. శిస్తుకు శిస్తూ తీసుకొని, నీరుకు నీరూ యీయకపోతే యింకేటి?' అన్నాడు. పుల్లయ్య.

'వెడిశావ్. సర్కారుని తిట్టుతున్నావు. జాగ్రత. తాసిల్దారుతో చెప్పి, జరిమానా వేయిస్తాను. పోలీసు యినస్పెక్టరుతో చెప్పి మీరు కర్రలతో కొట్టడానికి వచ్చినట్టు కేసుపెట్టిస్తాను' అని ఎగిరాడు ఓవరుసీరు.

రెండు పక్కలోళ్ళు పట్టుదలగానే ఉండారు. రెండుపట్ల కోప మెక్కువై పోతుండాది.

ఓవరుసీరు దబాయింపు నెగ్గలా

మా ఎంకడూ, మరికొందరు గుంటలు కలిసి, పూను తీసేశారు

ఎదిరోళ్ళ కర్రలు గుంటలనెత్తిమీద బడ్డాయి. మా ఎంకడి నెత్తిమీద గాయం తగిలింది. మాఓళ్ళు కూడ కొట్టడానికి ఎగబడ్డారు. సుతిమించి పోయింది నా మనస్సొప్పలా. ఈ ఓవరుసీరు మూలాన మేం మేం కొట్టుకు సస్తుంటే దూరంగా నిలబడి సిత్రం సూస్తా నిలబడ్డాడు. ఒక యేడటు, ఒక యేడిటు తిసి మా కొంపలు కూలుస్తుంది యీడేగదా అనుకున్నా. వెంటనే రైతులమధ్యకు తోసేసుకొని ఎళ్ళిపోయా. ఇద్దరిని యిసింతనెట్టి,

'ఓరప్పన్నా, మాదన్నా సూడండ్రా. ఎవరికి గాయాలు తగిలేది? మన కర్రలు మన బుఱ్ఱలు పగలకొడ్తుండయిరా. పెబువులు పెబువులుగానే ఉండారు. పోయిన సంవత్సరం మా వూరి పెద్దరైతుకాడ లంచం దీసుకొని మీకు అన్నాయం సేసి, నీరు మావూరికి తిప్పాడు ఈ ఓవర్సీరు. మరచిపోయా రంటరా. ఈసారి మీ పెద్దరైతువీరయ్యకాడ లంచం దీసుకున్నాడు కామోను. మాకన్నాయం సేయడానికి పూనుకున్నాడు. మనమందరం యిలా పెబువులకు లంచాలిచ్చి, మన బుఱ్ఱలే పగలకొట్టుకుంటూ ఉంటే ఇంకేం బతుకురా. రైతూ, రైతూ ఒకటి. మొన్న పోలీసు యినస్పెక్టరు మీవూరి రైతులను బాదాడు వారుఫండిమ్మని మావూరి రైతులనూ బాదాడు. మరచిపోయారంట్రా. మన అందరి పొలాలు ఒకలాంటివే. మన కందరికీ నీరు కావాలి. అన్నాయంగా మాటాడితే ఎట్రా' అన్నా నేను.

దీంతోటి కూంతకాలపోతే కొంతవేడి అణిగింది. మా రైతులు కర్రలుదించి వింటుండారు. వెంకటాపురం రైతులు గూడా నిమ్మళించి వాళ్ళలో వాళ్ళు సంప్రదించుకుంటున్నారు.

'నీవు సెప్పేది సరేనోస్. మాకు నీరు కావాలి. పూనెయ్యాక మాన' నన్నారు వెంకటాపురం రైతులు.

'అయితే. నే నొకటి సెపుతా యినండి. అన్నిటికంటెముందు మన రెండూళ్ళ రైతులు ఒకమాట మీద నిలవాలి. ఆమాట పెకారం సెయ్యడానికి ఉత్తరువు ఓవర్సీరు బాబు నడుగుదాం'.

'సరే' నన్నారు వెంకటాపురం రైతులు.

'సూడండ్రా. మీారు పూను ఈ రేతి రేసుకోండి. పూనుకు దిగవ బట్టిలో మేం గండేసుకుంటాం. పగటి పూట మా మూలుగా రెండూ తీసేద్దాం సరేనంట్రా? "అని అడిగా.

"బలే బాగుంది" అన్నారు మా కుమరాడ రైతులు.

'సరే'నన్నారు. వెంకటాపురం రైతులు. దూరంగా నిలబడ్డాడు ఓవర్సీరు. కొట్టుకోడంలేదని దుఃఖ పడతా మాకాడికే వచ్చాడు.

'ఇలాం నేసేనే' మనకు తగువు నేకుండా పోతాది. వేరే మార్గం లేదురా. ఏమండీ ఓవర్సీరుగారూ! అలా సెయ్యనియ్యండి మమ్మల్ని' అన్నా.

ఓవరుసీరుకు ఏటి సెప్పడానికి తోచలా. రెండూళ్ళ రైతులు ఒక టయ్యేతలికి ఆయనకు బయమేసి నట్టుండాది.

'ఆఁ, అలా వీల్లేదు. మా రూల్సు ఒప్పుకో' వన్నాడు.

'రూల్సు గీల్సు మాకు తెలి యదు. మేం రైతులందరం ఒప్పు కున్నాం. మే మలాగే సేసి తీర్తాం. మీారూ ఒప్పుకోవాలి' అన్నాడు ఎంకడు.

'నే నొప్పుకుంటే సరిపో యిందా ఏంటి? రేపు పొద్దున్నే కరణం వచ్చి కేసు పెడతాడు చూసుకో' అన్నాడు

'కేసు గీసు అని, కరణంగాని, మునసబుగాని, మాదగ్గరకు గాని వచ్చారా......యిదిగో...' అని రెండూళ్ళ రైతులు సేతుల్లో కఱ్ఱలు సూపించారు ఓవరుసీరు బాబుకు.

'మీా యిష్టం వచ్చినట్టేడవండి' అని వెళ్ళిపోయినాడు ఓవరుసీరు— అతనితోటి, అతని గుమస్తాకూడా.

యుద్ధం తప్పింది; కాని ఓవరు సీరు లంచాలు పోతయ్యని అను కున్నాడేమో మొహం మాడ్చుకుని పోయాడు.

మా మా యిళ్లకు రైతులం వచ్చేశాం.

ఒప్పుకొన్న పెకారం ఎంకటా పురం రైతులు పూనేశారు. రేతిరి దానికి కూంత దిగవ మేం గండీ కొట్టాం. ఆరేతిరి, రేతిరి నారేను కోడానికి రెండూళ్ళ రైతులు పోలాని కెళ్ళి, పొలానికి నీరెట్టుకున్నాం. వాళ్ళకు నీరు సాకపోతే మేలం గండీ తీసేశేటోళ్ళం. మాకు నీరు సాలకపోతే వాళ్ళు పూను తీసేశే

(మిగతా 60 వ పేజీలో)

భావకవిత్వమవుతుంది. గోర్కీ చెప్పినట్లు నిర్జీవమైన ఈ భావకవిత్వం "రంగుపూసి వాస్తవాన్ని మరుగుపరచి, ప్రజల్ని సంతృప్తిపరచడానికి ప్రయత్నిస్తుంది"

ఈ నాటకంలో జాతీయోద్యమ ప్రభావాన్ని గానీ, ఇత్తిహాదుల్ ముసల్మీన్ మతావేశాన్ని గానీ, ఆంధ్రమహాసభా రాజకీయ ప్రభావాన్ని గానీ, అతిప్రధానమైన లెవీసమస్యమీద జరుగుతున్న పోరాటాల ప్రభావాన్ని గానీ, తెలంగాణ ప్రజలు తమ ప్రాణసమానంగా గౌరవించే నారాయణరెడ్డి ఎల్లారెడ్డి మొదలైన ప్రజానాయకుల ప్రభావాన్ని కానీ ఏ పాత్ర ప్రతిబింబించదు. పైగా మూడు నాలుగు రంగాల్లో కాంగ్రెసును కాంగ్రెస్ నాయకులను చౌకబారుగా వ్యాఖ్యానించడం జాతీయవాదులూ ఆంధ్రమహాసభ అనుయాయులూ అందరూ కలిసి ఒకే ఆశయ సాధనకోసం కృషి చేస్తున్న ఈరోజుల్లో ఇలాంటి వ్యాఖ్యానాలు ఏ ఉద్యమానికీ మేలు చేకూర్చవు. విమర్శకూ వెక్కిరింపుకూ భేదం వుంది. మీర్జాయిస్మాయిల్‌ను పెట్టి కాంగ్రెసును గానీ, గ్రామపటేలును పెట్టి వల్లభాయి పటేలును గానీ తూచి హాపించడం మర్యాదా కాదు; మంచిదీ కాదు. ఇక మూఢమతావేశాలను రెచ్చగొట్టి ప్రజలను చీలదీసి, నైజాం ప్రభుత్వాన్ని నిలబెట్టడానికి ప్రయత్నాలు చేస్తున్న ఇత్తిహాదుల్ ముసల్మీనను ఊరికే ఎరగనట్లు తోసివేసినంత మాత్రాన దాని విష స్వరూపం అంతరించదు. దాని తప్పుడు ప్రచారంవల్ల, అదే ప్రజలకెలా దూరమవుతున్నదో పాత్రలద్వారా నిరూపించవలసి వుంది. ఇలాంటి రాజకీయచిత్రణ లేని ఈ నాటకం కేవలం నిరర్థకమని చెప్పక తప్పదు.

ఇందులో ప్రతిపాత్రా, బజారు మనుష్యుల్లాగా, ఎప్పుడుపడితే అప్పుడు, ఎక్కడపడితే అక్కడ - స్త్రీ పురుష వివక్ష కూడా లేకుండా విచ్చలవిడిగా బూతులు మట్లాడతారు ఉదాహరణలు అనవసరం.

ఈవిధంగా ప్రజాజీవితాన్ని అవాస్తవికంగాను, అనుచితంగాను, ఊహాజనితంగాను, అసభ్యంగాను చిత్రించడం ప్రమాదకరం. ఇది ఏవిధంగాను అభ్యుదయ రచన అనిపించుకోదు.

—'ప్రయాగ'

[నీటి పంపకం - 56 వ పేజీ తరువాయి]

వారు. ఇలా ఒక రేతిరి కాదు! మూడు రేతిర్లు, మూడు పొగల్లు.

కరణం, మునసబులు తంత్రాలు పన్నుతా రనుకున్నాం గాని ఏమనుకున్నారో ఆ వూసే ఎత్తలా. రైతులంతా ఆశ్చర్యపోయారు.

వారం రోజులు పోయి, ఒక నాడు పొలంలో నేనూ, లచ్చి, పొరుగు పొలాల్లో వాళ్లూ పాటలు పాడుకుంటూ పనిచేసుకుంటున్నాం. లచ్చేమో గడ్డి మోపుతోంది ఎడ్లకి. నేనేమో నాగలాడిస్తున్నా. ఓవర్‌సీరయ్యా, అతని గుమస్తా ఆ పక్కల కొచ్చారు. గానీ మా దరికి రాలా, దొంగలల్లే దూరంగా వుండి కనిపెట్టి సూస్తుండారు.